గోవిందరావుపేట : సీడ్ మిల్లులో ధాన్యాన్ని పరిశీలించి అధికారులతో చర్చిస్తున్న ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

నకిలీ విత్తనాల నియంత్రణకు టాస్క్‌ఫోర్స్ బృందాలు

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగురూరల్/ గోవిందరావుపేట, మే 30 : నకిలీ విత్తనాల నియంత్రణకు జిల్లా స్థాయిలో రెండు టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సహాయ వ్యవసాయ సంచాలకులు, ములుగు, ఏటూరునాగారం విత్తన ధ్రువీకరణ అధికారి, పోలీస్ అధికారులతో ఈ బృందాలను నియమించినట్లు చెప్పారు. ఈ బృందాలు 24గంటల పాటు అందుబాటులో ఉంటాయన్నారు. గ్రామాల్లో తిరిగి విత్తనాలు అమ్మేవారితో పాటు, నకిలీ విత్తనాలు అంటగట్టే వారి వివరాలు తెలిస్తే 7288894761, 7288894766 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. కొన్ని విత్తన కంపెనీలు వ్యాపార నిమిత్తం తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, ఏ రకమైన పత్తి విత్తనాలైనా దిగుబడి ఒకే రకంగా ఉంటుందని తెలిపారు. సాగు పద్ధతులు, భూమి బలం ఆధారంగా పంట దిగుబడి ఉంటుందన్నారు. వ్యవసాయశాఖ గుర్తింపు పొందిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. విత్తనాల ఖాళీ ప్యాకెట్లు, బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకుంటే దిగుబడి రానప్పుడు సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

నాణ్యమైన విత్తనాలు తయారు చేయాలి

నాణ్యతా ప్రమాణాలతో కూడిన విత్తనాలను తయారు చేసి రైతులకు ముందస్తుగా అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మండల కేంద్రంలోని టీఎస్ ఎస్‌బీసీ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గోదాములో ఉన్న విత్తన నిల్వలను పరిశీలించి బ్యాచ్ నంబర్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనాలు సకాలంలో అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్‌చంద్ర, టీఎస్ ఎస్‌బీసీ ఫీల్డ్ సూపర్‌వైజర్ భిక్షపతి, ఏవో టెక్నికల్ ఎండీ వాజిద్, ఏఈవోలు గోపాల్‌రెడ్డి, దాదాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

మాతా శిశు మరణాలు జరుగకుండా చూడాలి

వెంకటాపూర్, మే 30 : జిల్లాలో మాతా శిశు మరణాలు జరుగకుండా చూడాలని డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లం అప్పయ్య అన్నారు. గురువారం మండలకేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. దవాఖానలో ప్రతి మంగళ, గురువారాల్లో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ కార్యక్రమం, వైద్యులు అందిస్తున్న సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ ల్వేర్ ఆదేశాల మేరకు జనవరి నుంచి నిర్వహిస్తున్న బాలింతల ఆరోగ్య సంరక్షణ ద్వారా మాతా శిశు మరణాల రేటును తగ్గించాలని కమిషనర్ ఆదేశించారన్నారు. ప్రసవం అనంతరం తల్లీబిడ్డలను 45 రోజులు కనీసం 6 నుంచి 7 సార్లు సందర్శించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఇద్దరు బాలింతల ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీకాంత్, రిషిత, భవ్య, ఏఎన్‌ఎంలు, ఆశా, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడి మృతి

కాటారం, మే 30 : మండలంలోని ధన్వాడలో ఈ నెల 21న ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి పడి వరంగల్ ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతున్న గీత కార్మికుడు బుర్రి వెంకటేశం గురువారం మృతి చెందినట్లు ఎస్సై అభినవ్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వేతన వెతలు

భూపాలపల్లి జిల్లా దవాఖానలో కార్మికుల ఆకలికేకలు

- కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, డీఎంఎఫ్‌టీ సిబ్బందికి అందని జీతాలు
- ఆస్పత్రిలో పని చేయని పరికరాలు, వైద్య సిబ్బంది కొరత
- మూత్ర పరీక్షలూ ప్రైవేటుకే..
- కేసీఆర్ ప్రభుత్వమే నయమంటున్న ప్రజలు

జయశంకర్ భూపాలపల్లి, మే 30 (నమస్తే తెలంగాణ) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని వంద పడకల దవాఖానలో కార్మికులకు వేతనాలు సరిగా అందక ఆకలితో అలుమటిస్తున్నారు. నెలల తరబడి జీతాలు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చింది. జిల్లా కేంద్రంలో వంద పడకల దవాఖానను నిర్మించి భూపాలపల్లితో పాటు సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. అంతేకాకుండా మెడికల్ కళాశాలను నిర్మించి విద్యార్థులకు వైద్య విద్యను అందిస్తున్నది. అలాగే ఆయుష్ వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు 50 పడకల భవన నిర్మాణాన్ని ప్రారంభించగా పనులు చివరి దశలో ఉన్నాయి. అంతేకాకుండా ఆస్పత్రిలో పనిచేసే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి నెలనెలా వేతనాలు ఇచ్చి ఆదుకున్నది. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి వారికి వేతనలు సరిగా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ పోషణ భారమై ఆర్థికంగా చితికిపోతున్నారు. ప్రభుత్వం డబ్బులు చెల్లించకపోడంతో చేతి నుంచి జీతాలు ఇవ్వలేక కాంట్రాక్టర్లు తలలు పట్టుకుంటున్నారు. డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రావాల్సిన వేతనాలు సైతం అందడం లేదని ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఐదు నెలలుగా అందని వేతనాలు

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. దవాఖానలో 62 మంది కాంట్రాక్టు, 18 మంది ఔట్ సోర్సింగ్ కార్మికులు ఆయా విభాగాల్లో పని చేస్తున్నారు. మరో 15 మందికి జిల్లా కలెక్టర్ డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి వేతనాలు ఇస్తూ ఆస్పత్రిలో పనులు చేయిస్తున్నారు. కాగా, 62 మంది కాంట్రాక్టు కార్మికులకు ఐదు నెలలుగా అంటే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వేతనాలు రావడంలేదు. 18 మంది ఔట్ సోర్సింగ్ కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు అందడం లేదు. కాంట్రాక్టర్లే కార్మికుల పీఎఫ్ డబ్బులు చెల్లిస్తూ నెట్టుకొస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఫండ్ (డీఎంఎఫ్‌టీ) నుంచి రావాల్సిన వేతనాలు సైతం రెండు నెలలుగా అందడంలేదని కార్మికులు వాపోతున్నారు.

భూపాలపల్లి పట్టణంలోని వంద పడకల ప్రధాన ఆస్పత్రి

దవాఖానలో సిబ్బంది కొరత

జిల్లా దవాఖానలో సిబ్బంది కొరత ఏర్పడింది. 100 పడకల నుంచి 140 పడకలకు అప్‌గ్రేడ్ చేయగా ప్రస్తుతం 162 పడకలకు పెరిగింది. దానికి అనుగుణంగా సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందికర పరిస్థితిలు నెకొన్నాయి. 140 పడకలకు 80 మంది డాక్టర్లు అవసరం ఉండగా ప్రస్తుతం 10 విభాగాలకు 40 మంది ఉన్నారు. అయితే ఔట్ పేషెంట్లకు సరిపడా డాక్టర్లు ఉన్నా త్వరలో మెడికల్ కళాశాల విద్యార్థులు జిల్లా ఆసుపత్రికి ప్రాక్టికల్ శిక్షణకు రానున్నారు. డాక్టర్లు వారిని పేషెంట్ల దగ్గరికి తీసుకెళ్లి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. అప్పుడు వైద్యుల కొరత తీవ్రతరమయ్యే అవకాశం ఉంటుంది. ఇదిలా ఉండగా ఆస్పత్రిలో ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ పరికరాలున్నా రేడియాలజిస్టు లేక ప్రైవేట్ రేడియాలాజిస్టును ప్రతి రోజూ పిలిపించి రోజుకు 15 మందికి స్కానింగ్ పరీక్షలు చేయిస్తున్నారు. కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్ సౌకర్యం లేదు. కేవలం బేసిక్ యూరిన్ ఎగ్జామినేషన్ మాత్రమే చేస్తున్నారు.

వేతనాల పెండింగ్ వాస్తవమే..

- కే నవీన్‌కుమార్, సూపరింటెండెంట్

దవాఖానలో కాంట్రాక్టు , అవుట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. మే తో కలిపి ఐదు నెలలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయమై వైద్య విధాన పరిషత్, ప్రభుత్వానికి కలెక్టర్ ద్వారా విన్నవించాం. వైద్యులు, అదనంగా సిబ్బంది కావాలని రెండు సార్లు నోటిఫికేషన్ ఇచ్చాం. కొందరు వచ్చారు. కొందరు జాయిన్ కాలేదు. ప్రొఫెసర్ స్థాయి వైద్యులు జాయిన్ కావడం లేదు. అదనంగా మిషనరీలు, సిబ్బందిని త్వరలోనే సమకూర్చుతాం. కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్ ఇక్కడ చేయని మాట వాస్తవమే. ఒక ప్రైవేట్ ల్యాబ్‌తో త్వరలో టయప్ అవుతాం. పరీక్షలను అందుబాటులోకి తెస్తాం.

చిట్యాల : తనిఖీ చేస్తున్న ఎస్సై శ్రావణ్ కుమార్, ఏవో శ్రీనివాస్‌రెడ్డి

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

షాపులను తనిఖీ చేసిన ఏవోలు, ఎస్సైలు

మహదేవపూర్/గణపురం/చిట్యాల, మే 30 : రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మహదేవపూర్, గణపురం, చిట్యాల ఎస్సైలు పవన్‌కుమార్, మచ్చ సాంబమూర్తి, శ్రావణ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారులు ముల్కల ప్రభావతి, దేశబోయిన ఐలయ్య, శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం మహదేవపూర్, గణపురం, చెల్పూర్, గొల్లపల్లి, చిట్యాలలోని విత్తన దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తన ప్యాకెట్ల లాట్ నంబర్, గడువు తేదీ, ఎమ్మార్పీ ధరలను పరిశీలించారు. డీలర్లు నిబంధనలు పాటించాలని, విత్తనాల కృతిమ కొరత సృష్టించినా, ఎమ్మార్పీకి మించి అమ్మినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులు అధీకృత డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేసి రసీదు తీసుకొని పంట కాలం పూర్తయ్యేవరకు భద్రపర్చుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా నకిలీ విత్తనాలను విక్రయిస్తే వెంటనే పోలీసులు, వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలన్నారు. వారి వెంట టాస్క్‌ఫోర్స్ ఎస్సై రమేశ్, ఏఈవోలు ధర్మేందర్, రమణకుమార్, కానిస్టేబుళ్లు మారపెల్లి ప్రభాకర్, ప్రవీణ్, శ్రీనాథ్ తదితరులున్నారు.

ఓట్ల లెక్కింపులో పొరపాట్లు చేయొద్దు

- **భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా**

భూపాలపల్లి రూరల్, మే 30 : జూన్ 4న జరగనున్న పార్లమెంట్ ఓట్ల లెక్కింపులో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిష్పక్షపాతంగా పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు కౌటింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 317 పోలింగ్ కేంద్రాల ఓట్ల లెక్కింపునకు 18 రౌండ్లు ఉంటాయని, 18 టేబుల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విధులు కేటాయించిన సిబ్బంది 4న ఉదయం 6 గంటలకు వరంగల్ కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. వీవీ ప్యాట్ స్లిప్పులు కౌంటింగ్ చేసేందుకు ప్రత్యేక లెక్కింపు బూత్ ఏర్పాటు చేయాలని, ప్రతి రౌండ్‌లో మైక్రో అబ్జర్వర్‌తో పాటు కౌటింగ్ ఏజెంట్ సంతకాలు తీసుకోవాలని సూచించారు. లెక్కింపు కేంద్రంలోకి సెల్‌ఫోన్స్, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుపోవడానికి అనుమతి లేదన్నారు. సమావేశంలో ఆర్డీవో మంగాలాల్ పాల్గొన్నారు.

జిల్లాలో విత్తనాలకు కొరత లేదు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఎలాంటి విత్తనాల కొరత లేదని, రైతులు ఆందోళన చెందొద్దని కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో గత సంవత్సరం 1.11 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారని, ఈ సంవత్సరం 1.5 లక్షల ఎకరాల్లో వరి, 18 వేల ఎకరాల్లో మిరప, లక్ష ఎకరాల్లో పత్తి పంట సాగు చేసే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారని తెలిపారు. విత్తనాల కొరత లేదని, ఎవరైనా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటి వరకు జిల్లాకు 43 వేల పత్తి విత్తన ప్యాకెట్లు వచ్చాయని, వాటిలో 3 వేలు విక్రయించామని, అదనంగా మరో 50 వేల ప్యాకెట్లు వస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 315 ఫర్టిలైజర్ షాపులు ఉన్నాయని, కొనుగోలు చేసిన విత్తనాలకు రైతులు రసీదులు తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు నిఘా ఉంచామని, అలా విక్రయిస్తే వారిపై పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఫర్టిలైజర్ షాపు తనిఖీ

జిల్లా కేంద్రంలోని శివసాయి బాబా ఫర్టిలైజర్ దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు, అమ్మకాలకు సంబంధించిన రిజిస్టర్, విత్తన ప్యాకెట్లు, నిల్వ స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మవద్దని, నాణ్యమైన విత్తనాలను మాత్రమే అమ్మాలని, గడువు తీరిన, సీలు లేని విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి విజయ భాస్కర్, జిల్లా ఉద్యాన అధికారి సంజీవరావు, ఏఈ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మకాల రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ భవేశ్ మిశ్రా

ఇసుక తవ్వకాలతో కరకట్టకు ముప్పు

ఏటూరునాగారం, మే 30 : మండలంలోని ఒడ వాడ శివారు పట్టాభూముల్లో ఇసుక మేటల తొలగింపు పేరుతో నడుస్తున్న క్వారీని మంత్రి సీతక్క ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు గురువారం సాయంత్రం సందర్శించారు. గ్రామానికి వరద ముప్పు వాటిల్లేలా ఉన్న ఇసుక క్వారీని నిలిపివేయాలని కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు చిటమట రఘు, కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, నాయకుడు ముక్కెర లాలయ్య కోరారు. ఇసుక తీయడం వల్ల కరకట్ట, ప్రజలకు పెను ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందన్నారు. పట్టాదారులకు వెంటనే డబ్బులు చెల్లించాలని కోరారు. ఇసుక తవ్వకాలపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వారి వెంట మైనార్టీ జిల్లా అధ్యక్షుడు అయూబ్, శివాలయం కమిటీ చైర్మన్ మడుగూరి ప్రసాద్, వల్స తిరుపతి,చెన్న రాంబాబు, ఖలీల్, కిశోర్ తదితరులు ఉన్నారు.

పేకాట శిబిరాలపై దాడులు

- **రూ. 2,15,500, రెండు కార్లు, ఐదు బైకులు, 13 సెల్‌ఫోన్లు స్వాధీనం**
- **పోలీసులు అదుపులో 19 మంది పేకాట రాయుళ్లు**

తాడ్వాయి, మే 30 : మండలంలోని మేడారం గ్రామ శివారులో రెండు పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు చేశారు. పేకాడుతున్న 19 మందితో పాటు భారీగా నగదు, బైక్‌లు, కార్లను స్వాధీనం చేసుకున్నారు. మేడారం శివారులో పేకాడుతున్నారనే సమాచారం మేరకు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది కొంగళమడుగు ప్రాంతంలో తనిఖీలు చేశారు. ఈ క్రమంలో పేకాడుతున్న మేడారానికి చెందిన రాజు, సతీశ్, చీర్ల రవి, నార్లాపురానికి చెందిన లక్ష్మణ్‌ను అదుపులోకి తీసుకోగా మేడారానికి చెందిన రాజు, నరేశ్‌తోపాటు కాల్వపల్లికి చెందిన మరో వ్యక్తి పారిపోయినట్లు తెలిపారు. నిందితుల నుంచి రూ.10,500, ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం శివరాంసాగర్ చెరువు వద్ద వీవీఐపీ పార్కింగ్ సమీపంలో మరో పేకాట శిబిరంపై దాడి చేయగా 14మంది నిందితులతో పాటు రూ.2.5 లక్షలు రెండు కార్లు, 13 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. ఈ 14మంది వరంగల్‌తో పాటు మంచిర్యాల జిల్లాలకు చెందిన వారు. తల్లుల దర్శనానికి వచ్చి వీఐపీ పార్కింగ్ వద్ద పేకాడుతూ పోలీసులకు పట్టుబడ్డారు.

అదుపులోకి తీసుకున్న పేకాట రాయుళ్లు

హనుమాన్ గుడికి దాతల సహకారం

గణపురం, మే 30 : మండలంలోని ధర్మారావుపేట గ్రామంలోని ఆంజనేయ స్వామి గుడికి దాతల సహకారంతో చేపట్టిన రేకుల షెడ్డు, గ్రానైట్ నిర్మాణ పనులు గురువారం పూర్తయ్యాయి. పీఆర్టీయూ మండలాధ్యక్షుడు బిల్ల రఘునాథ్‌రెడ్డి సౌజన్యంతో గొర్లవీడుకు చెందిన తిప్పిరెడ్డి పద్మా శంకర్‌రెడ్డి దంపతులు గ్రానెట్ నిర్మాణ పనులకు రూ.50వేలు ఇవ్వగా రేకుల షెడ్‌కు రాజోజు నిర్మలా ఆనందం, రాజోజు చంద్రకళా సాంబమూర్తి, రాజోజు రాధికా రాజు దంపతులు రూ. 30 వేలు అందించారు. గ్రామంలోని వారికి ఉమా మహేశ్వర సేవా సమితి అధ్యక్షుడు సుభాష్ కృతజ్ఞతలు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, NEELOFOR, D/o KHAJA AZEEM UDDIN R/o 11-23-1310, L.B. Nagar, Warangal, Warangal Urban-506002, Telangana, India. I have Changed My Name to **NEELOFOR JAHAN** and Solemnly declare.

NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

మానవత్వం చాటుకున్న కిరాణా వ్యాపారి

డబ్బులు మర్చిపోయిన వ్యక్తికి రూ.3.50 లక్షలు అందజేత

ములుగు రూరల్, మే 30 : తన షాపులో డబ్బులు మరిచిపోయిన వ్యక్తికి తిరిగి అందజేసి మానవత్వం చాటుకున్నాడు ములుగు జిల్లా కేంద్రానికి చెందిన కిరాణా వ్యాపారి ఆడెపు శ్రీనివాస్. వివరాల్లోకి వెళితే.. ములుగు మండలం పందికుంట గ్రామానికి చెందిన సింగరేణి ఉద్యోగి పత్తిపాక సాంబయ్య జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకులో రూ.3.50లక్షలు తీసుకున్నాడు. ఇంటికి వెళ్లే క్రమంలో బ్యాంకు సమీపంలో ఉన్న మహాలక్ష్మి కిరాణా షాపునకు వెళ్లి సరుకులు తీసుకొని డబ్బుల కవర్‌ను అక్కడే మరిచిపోయి వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత షాపు యజమాని శ్రీనివాస్ అనుమానాస్పదంగా తన టేబుల్ మీద ఉన్న కవర్‌ను తీసి చూడగా అందులో డబ్బులు కనిపించడంతో పక్కన పెట్టాడు. కొంత సమయానికి బాధితుడు సాంబయ్య వచ్చి అడుగగా, అతడి పూర్తి వివరాలు, డబ్బులు ఎంత ఉన్నాయనే విషయాలను తెలుసుకొని నిర్ధారణ చేసుకొని అందజేశాడు. షాపు యజమాని మంచితనంపై బాధితుడు ప్రశంసలు కురిపించి ధన్యవాదాలు తెలిపాడు.

బాధితుడు సాంబయ్యకు డబ్బులు ఇస్తున్న శ్రీనివాస్

'మావోయిస్టుల సమాచారమివ్వాలి'

కాటారం, మే 30 : మావోయిస్టు పార్టీలో పని చేస్తున్న వారి వివరాలు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కాటారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి ప్రజలను కోరారు. ఎస్పీ ఆదేశాల మేరకు మావోయిస్టు పార్టీలో పని చేస్తున్న వారిపై ప్రభుత్వం విధించిన రివార్డులతో కూడిన పోస్టర్‌ను గురువారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎవరైనా అనుమానితంగా సంచరిస్తే తెలియజేయాలని, అందుకు వారికి తగిన పారితోషికం ఉంటుందన్నారు.

గుడికుంట చెరువును కాపాడాలి

వెంకటాపూర్, మే 30 : మండలంలోని జవహర్‌నగర్ గుడికుంట చెరువు కబ్జా కాకుండా కాపాడాలని తహసీల్దార్ సదానందంకు రైతులు గురువారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 21 ఎకరాల్లో ఉన్న చెరువు 450 ఎకరాలకు నీరందిస్తుందన్నారు. చెరువు శిఖాన్ని కొందరు కబ్జా చేస్తున్నారని దానిని కాపాడాలని రైతులు కోరారు. తహసీల్దార్ సదానందం మాట్లాడుతూ మూడు రోజుల్లో సర్వే టీంను పంపించి హద్దురాళ్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

మల్లూరు ఆదాయం రూ. 11.62 లక్షలు

మంగపేట, మే 30 : మల్లూరు లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో ఆలయ సిబ్బంది గురువారం హుండీలు లెక్కించారు. మార్చి 27 నుంచి ఈనెల 29 వరకు భక్తులు కానుకలు వేశారు. హుండీ ద్వారా రూ.11.62లక్షల ఆదాయం వచ్చినట్లు ఇన్‌చార్జి ఈవో మహేష్ తెలిపారు. హుండీలో విదేశీ కరెన్సీ 17 డాలర్లు వచ్చాయన్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ మహబూబాబాద్ డివిజన్ పరిశీలకులు కవిత, ఆలయ అర్చకుల రాజశేఖరశర్మ, రాఘవాచార్యులు, ఈశ్వర్ చంద్ శర్మ, పవన్‌కుమార్ చార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


హుండీల్లోని కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మల్హర్, మే 30 : మండల కేంద్రమైన తాడిచర్లలోని జడ్పీ సెకండరీ పాఠశాలలో 1992-93లో పదో తరగతి చదివిన విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 31 ఏళ్ల తర్వాత కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వారి స్థితిగతులను చర్చించుకున్నారు. ఈ సందర్భంగా చదువు చెప్పిన గురువులను శాలువాలతో సన్మానించి మెమెంటోలు అందజేశారు. రోజంతా సంతోషంగా గడిపి ఒకరికి ఒకరు వీడ్కోలు పలికారు. మళ్లీ కలవాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన ధనుంజనేయులు, మల్కా గోపాల్, రవీందర్, గౌస్ పాషా, మొగిలి, సతీశ్, ప్రవీణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న జీఎం సయ్యద్ హబీబ్ హుస్సేన్

ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

భూపాలపల్లి ఏరియా జీఎం హబీబ్ హుస్సేన్

భూపాలపల్లి రూరల్, మే 30 : తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని భూపాలపల్లి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ సయ్యద్ హబీబ్ హుస్సేన్ ఆధికారులను ఆదేశించారు. గురువారం భూపాలపల్లి జీఎం కార్యాలయంలో ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని మైన్స్ రెస్క్యూ స్టేషన్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలన్నారు. స్థానిక ప్రజలు, ఉద్యోగులకు ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆటలు, పాటలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించాలని జీఎం సూచించారు. సమావేశంలో ఎస్వోటూ జీఎం కవీంద్ర, ఏజీఎం జ్యోతి, ఏరియా ఇంజినీర్ రామకృష్ణారెడ్డి, ఏఎస్వో ప్రసాద్, గ్రూప్ ఏజెంట్ రాజశేఖర్, డీజీఎం రవికుమార్, డీవైపీఎం శ్యామ్‌ప్రసాద్, ఏరియా ఇన్‌చార్జి అధికార ప్రతినిధి రాజు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి బియ్యం అందజేత

ములుగురూరల్, మే 30 : ములుగు జిల్లా కేంద్రంలోని సఫాయి వాడకు చెందిన వృద్ధురాలు రామంచ ఐలుకొమురమ్మ బెస్తవాడలో అద్దె ఇంట్లో ఉంటూ ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకొని గురువారం గండ్రకోట సుధీర్ సేవా ఫౌండేషన్ సభ్యులు 25 కిలోల బియ్యం అందించారు. కార్యక్రమంలో మేర్గు సంతోష్, ఎనగందుల శ్రవణ్, వెంకటేష్, రాజునాయక్, నరేశ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలలో ఒకరికి గాయాలు

ఏటూరునాగారం, మే 30 : మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై గురువారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన కంకనాల రమేశ్ అనే వ్యక్తిని గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీ కొట్టింది. రెండో బ్రిడ్జికి సమీపంలో రేలింగ్ పక్క నుంచి నడుస్తుండగా ఈఘటన జరిగింది. రోడ్డు పక్కన సుమారు 20 అడుగుల కింద పడిపోవడంతో తీవ్ర రక్తస్రావమైంది. ఓ రైతు పొలం వద్దకు వెళ్లి వస్తుండగా రమేశ్‌ను గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో సామాజిక వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం వరంగల్ తరలించారు.

రామప్ప భూముల కౌలు వేలం వాయిదా

వెంకటాపూర్, మే 30 : రామప్ప దేవాలయ భూముల కౌలు వేలం వాయిదా పడినట్లు ఆలయ ఈవో బిల్లా శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణంలో వేలంపాట నిర్వహించగా రైతులు ఎవరూ రానందున వాయిదా వేసినట్లట్లు ఆయన తెలిపారు. వేలంపాట నిర్వహణ తేదీని నిర్ణయించి కౌలు వేలం నిర్వహిస్తామన్నారు.

వాహనం ఢీకొని గేదె మృతి

గోవిందరావుపేట, మే 30 : మండలకేంద్రంలోని పోచమ్మ గుడి సమీపంలోని జాతీయ రహదారిపై పాడి గేదెను గురువారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. గేదె మృతి చెందగా జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. విషయం తెలుసుకున్న పస్రా ఎస్సై కమలాకర్ జేసీబీ సాయంలో జీపీ సిబ్బందితో గేదెను తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ జాతీయ రహదారిపై పశువులను విడిచిపెట్టవద్దని గతంలో హెచ్చరించినా యజమానులు పట్టించుకోవడంలేదన్నారు. ఇకపై జాతీయ రహదారిపై పశువులను విడిచిపెట్టవద్దని సూచించారు.

సన్నబియ్యం పేరుతో దగా

ఏటూరునాగారం, మే 30 : మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌లో సన్న రకం పేరుతో దొడ్డు బియ్యం విక్రయించి మోసం చేసిన ఘటన గురువారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు తమ వద్ద కర్నూలు రకం సన్న బియ్యం 25 కిలోల బస్తా రూ.1000కి ఇస్తున్నట్లు నమ్మబలికారు. శాంపిల్ బియ్యాన్ని చూపించడంతో జాడి సమ్మయ్య అనే వ్యక్తి మూడు బస్తాలు (75 కేజీలు) కొన్నాడు. వాటిలో దొడ్డు బియ్యంతో పాటు పురుగులు ఉండడంతో మోసం పోయామంటూ లబోదిబోమన్నాడు. సదరు వ్యక్తుల కోసం పరిసరాల్లో వెతికినప్పటికీ కన్పించలేదు.

కొనుగోలు చేసిన బియ్యం బస్తాలు

ఇసుక రీచ్‌లను పరిశీలించిన అధికారులు

వెంకటాపురం(నూగూరు), మే 30: మండలంలోని సూరవీడు, ముత్తారం, రామచంద్రాపురం ఇసుక రీచ్‌లను గురువారం మైనింగ్ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మైనింగ్ ఏడీ జయరాజ్ ఇసుక రీచ్ సొసైటీ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్, సీఐ బండారి కుమార్, టీఎస్ఎండీసీ సిబ్బంది ఉన్నారు.

జూనియర్ కళాశాల మంజూరు

వెంకటాపురం (నూగూరు) మే 30 : వెంకటాపురం మండలానికి ప్రభుత్వం జూనియర్ కళాశాలను మంజూరు చేసింది. కాగా, ఈ విద్యా సంవత్సరంలో ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు తీసుకొని తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా వాజేడు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్‌ను నియమించింది. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో అడ్మిషన్లు జరుగుతాయని జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు.

చీకుపల్లిలో ముయ్యాలమ్మ జాతర

వాజేడు, మే 30 : మండలంలోని చీకుపల్లి గ్రామంలో గొంది వారి ఇలవేల్పు ముయ్యాలమ్మ జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. గురువారం శివసత్తుల పూనకాలు, భక్తుల కోలహలం మధ్య గొంది వంశస్తులు, వడ్డెలు, పూజారులు కంకవనం తీసుకొని వచ్చి ఆలయం వద్ద ప్రతిష్టంపజేశారు. గంగస్నానంతోపాటు ఆలయం వద్ద గుడి మెలగడంతో రెండో రోజు కార్యక్రమం ముగిసింది. శుక్రవారం ముయ్యాలమ్మ తల్లికి భక్తులు మొక్కులు చెల్లించుకున్న అనంతరం అమ్మవారిని వన ప్రవేశం చేస్తారు.

కంకవనం తెస్తున్న పూజారులు

కడుపు నొప్పితో మహిళ మృతి

ములుగు రూరల్, మే 30 : మండలంలోని బండారుపల్లికి చెందిన పెండెం నాగలక్ష్మి (32) కడుపు నొప్పితో మృతి చెందినట్లు ఎస్సై వెంకటేశ్వర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా బొగానపల్లి మండలం రామకృష్ణాపురానికి చెందిన చెవిటి, మూగ అయిన నాగలక్ష్మిని బండారుపల్లికి చెందిన పెండెం రాజేశ్‌కు ఇచ్చి 2020లో పెండ్లి చేశారు. కాగా, బుధవారం ఉదయం రాజేశ్ ఇంటి నుంచి పనికి వెళ్లగా నాగలక్ష్మి కడుపు నొప్పితో బాధపడుతుండగా అత్తా మామలు, ఆడబిడ్డ ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్సను అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి నెట్టికంటి పెద్దకులాయి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.